ముంగారు సేద్యానికి సమాయత్తం

- పొలాల్లో ఎడ్లు, ట్రాక్టర్ల సందడి
- దుక్కిదున్ని భూములు చదును
- అన్నదాతలకు వెన్నుదన్నుగా ఆర్బీకేలు



ట్రాక్టర్ ద్వారా భూమిని దున్నుతున్న దృశ్యం



ఆర్బీకేలో విత్తన కాయల నాణ్యతను పరిశీలిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: గత ఏడాది వర్షాలు విస్తారంగా కురిశాయి. వేసిన పంటలన్నీ చేతికందడంతో రైతుల్లో ఆనందం తాండవిస్తోంది. ఈక్రమంలో ఈ ఏడాది ముంగారు వర్షాలు కురవడంతో సేద్యానికి సమాయత్తం అవుతున్నారు. ఖరీఫ్‌లో సాగు చేయాల్సిన పంటలకు పొలాలను దుక్కి దున్నేందుకు పొలంబాట పడుతున్నారు. ఏ పొలంలో చూసినా ఎడ్లు, ట్రాక్టర్లతో సందడి కనిపిస్తోంది. పొలాల్లో ఉన్న కంపచెట్లను తొలగించి భూములను చదును చేసి శుభ్రం చేసుకుంటున్నారు. పంటల సాగుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా అన్నదాతలకు వెన్నుదన్నుగా ఉంటోంది. దీంతో ఎలాంటి నిరాశ లేకుండా రైతులు ముందుకు సాగుతున్నారు. రైతుకు అప్పుల భారం పడకుండా ప్రభుత్వం పెట్టుబడి సాయం ఈ నెలలోనే ఖాతాల్లోకి జమ కానుంది. ఆర్బీకేల ద్వారా గ్రామ స్థాయిలోనే రాయితీ విత్తన కాయలు పంపిణీ చేయనుంది. మడకశిర వ్యవసాయశాఖ డివిజన్ పరిధిలో 30 వేల హెక్టార్లకు పైగా వేరుశనగ పంటను రైతులు సాగు చేయనున్నారని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఆమేరకు సబ్సిడీ విత్తన కాయలు ఆర్బీకేలకు చేరుతున్నాయి. రెండు, మూడు రోజుల్లోనే విత్తన కాయల పంపిణీ కోసం రైతుల పేర్లు నమోదు చేసుకుంటామని తెలిపారు.

అర్హులందరికీ సబ్సిడీ వేరుశనగ విత్తన కాయలు

ఖరీఫ్‌లో వేరుశనగ సాగు చేసే రైతులందరికీ ప్రభుత్వం అందించే సబ్సిడీ విత్తన కాయలను పంపిణీ చేస్తాం. మూడు రోజుల్లోపే ఆర్బీకేల్లో విత్తన కాయల కోసం పేర్లు నమోదు చేసుకునేలా రైతులకు సమాచారం ఇవ్వనున్నాం. రైతులకు నాణ్యమైన విత్తన కాయలు అందిస్తాం.

– వీర నరేష్, వ్యవసాయశాఖ ఏఓ, మడకశిర మండలం



ఉష్ణోగ్రత సమాచారం (గరిష్ఠం)

హిందూపురం	37.0
పెనుకొండ	40.0
మడకశిర	37.0

తాగునీటి సమస్య పరిష్కారం



బోరు వేసిన దృశ్యం

గుడిబండ: మండల పరిధిలోని హెచ్‌ఆర్ హట్టి గ్రామంలో నీటి ఎద్దడి తీరింది. గ్రామంలో నెలకొన్న నీటి సమస్యను గుర్తించిన ఎంపీపీ రాధమ్మ ఆదివారం గ్రామ సమీపంలో బోరుబావి తవ్వించారు. నీరు సమృద్ధిగా పడటంతో గ్రామస్తుల్లో ఆనందం తాండవించింది. పైప్‌లైన్ ద్వారా నీటిని సరఫరా చేస్తామని ఎంపీపీ తెలిపారు.

క్లుప్తంగా

సిద్ధేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



పూల అలంకరణ సిద్ధేశ్వరస్వామి

అమరాపురం: హేమావతి గ్రామంలో కొలువైన శ్రీ సిద్ధేశ్వరస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం తదితర పూజలు చేశారు. అనంతరం భక్తులు తెచ్చిన వివిధ పూలతో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేసింది.

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న నాగభూషణప్ప

రొద్దం: మండల కేంద్రంలోని పెన్నానది ఒడ్డున వెలసిన పురాతన రొద్దకాంబదేవి నూతన ఆలయ నిర్మాణానికి ఈడిగ అరుణకుమారి నాగభూషణప్ప కుటుంబ సభ్యులు ఆదివారం ఆలయ కమిటీకి రూ.లక్ష విరాళం అందజేశారు.

కరావులీశ్వర ఆలయ నిర్మాణానికి...



విరాళం అందజేస్తున్న యర్ర భాస్కర నాయక్

గోరంట్ల: కరావులపల్లి గ్రామంలో కరావులీశ్వర ఆలయ నిర్మాణానికి పుట్టపర్తి మండలం పెడపల్లి సర్పంచ్ కుమారుడు యర్రభాస్కర్ నాయక్ ఆదివారం రూ. 50 వేల విరాళం ప్రకటించారు. ఈ మొత్తాన్ని ఆలయ కమిటీ సభ్యులు రేపటి రామచంద్రారెడ్డి , గంపల వెంకటరమణారెడ్డి, చింతా కృష్ణారెడ్డి, మేకల రంగప్ప,గొల్ల శ్రీరాములకు అందజేశారు. వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు తిరుపాల్ నాయక్ పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న బ్రహ్మకుమారీలు

లేపాక్షి: లేపాక్షిలో ఆలయాల సందర్శనకు వచ్చిన భక్తులకు, పర్యాటకులకు ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయ బ్రహ్మకుమారీలు ఆదివారం బస్టాండ్ వద్ద మజ్జిగ పంపిణీ చేశారు. సర్పంచ్ ఆదినారాయణ, సేవా కేంద్రం ముఖ్య సంచాలకురాలు బ్రహ్మకుమారీ వసంత పాల్గొన్నారు.

ఉపాధ్యక్షుడిగా రవూఫ్

పెనుకొండ: అంతర్జాతీయ పౌర, మానవహక్కుల కమిషన్ ఏపీ ఉపాధ్యక్షుడిగా పట్టణానికి చెందిన రవూఫ్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర నాయకులు ఆదేశాలు జారీ చేశారని రవూఫ్ ఆదివారం తెలిపారు.

వాహనాల వేలం వాయిదా

పెనుకొండ: పట్టణంలోని సెబ్ కార్యాలయంలో సోమవారం జరగాల్సిన వాహనాల వేలం వాయిదా పడిందని సీఐ సుబ్బారెడ్డి ఆదివారం తెలిపారు. తదుపరి తేదీని త్వరలో తెలియజేస్తామని ఆయన తెలిపారు.

'గ్యారంటీ కార్డు' హామీలతోనే కాంగ్రెస్ గెలుపు



కేపీసీసీ చీఫ్ డికే శివకుమార్‌తో కాంగ్రెస్ విజేత వెంకటేశ్

పావగడ: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో పొందుపరిచిన గ్యారంటీ కార్డు హామీలు, ఇతర జనాకర్షణ పథకాలే కాంగ్రెస్ అభ్యర్థి హెచ్‌వీవి వెంకటేష్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించినట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పేద కుటుంబాల్లోని ఒక్కో వ్యక్తికి 10 కేజీల బియ్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ప్రతి నెలా రూ2 వేల ఆర్థిక సాయం, మహిళలకు ఉచిత బస్ పాస్ వంటి హామీలు ఆ పార్టీకి ఓట్లు కురిపించినట్లు భావిస్తున్నారు. మరో వైపు మాజీ సీఎం సిద్దరామయ్య మళ్ళీ సీఎం అవుతారని ప్రచారం చేయడంతో కురుబలు పెద్ద ఎత్తున కాంగ్రెస్ అభ్యర్థికి ఓట్లు వేశారని వారు భావిస్తున్నారు.

భజే ఆంజనేయం..శ్రీరామదూతం



మడకశిరలో తమలపాకులతో అలంకరణ



ప్రత్యేక అలంకరణలో బూదిలి కాడిమాను ఆంజనేయ స్వామి



అమరాపురంలో గంధంతో అలంకరణ



రొద్దంలో సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయస్వామి ఉత్సవమూర్తుల ఊరేగింపు

- వైభవంగా హనుమద్ జయంతి
- మార్మోగిన జై హనుమాన్ నామస్మరణ



పెనుకొండలో వెన్న అలంకరణలో ఆంజనేయస్వామి మూలవిరాట్

మడకశిర: హనుమజ్జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఆంజనేయస్వామి, రామాలయాలు హనుమ నామస్మరణతో మార్మోగాయి. వేలాది సంఖ్యలో భక్తులు ఆలయాలకు చేరుకొని ఆంజనేయస్వామికి పూజలు చేశారు. మడకశిరలో మిట్టబండ ఆంజనేయస్వామి, వివిధ ఆంజనేయస్వామి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. షిరిడీ సాయిబాబా ఆలయంలో ఆంజనేయస్వామిని తమలపాకులతో అలంకరించి పూజలు నిర్వహించారు. పంచామృతాభిషేకం,అష్టోత్తర పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

పెనకొండ రూరల్: గుట్టురూ,మునిమడుగు, అడదాకులపల్లి గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూలు నిర్వహించారు.భజనలు, హనుమన్ చాలీసా పఠనం నిర్వహించారు.

గోరంట్ల: బూదిలిలో వెలసిన కాడిమాను ఆంజనేయ స్వామి ఆలయంలో రుద్రాభిషేకం, అభిషేకం నిర్వహించారు. సీతారాముల కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని ధనాంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

సోమందేపల్లి: సోమందేపల్లిలోని పాతూరులో ఆంజనేయ స్వామి ఆలయంలో వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. యువకులు బైక్ ర్యాలీ నిర్వహించి హనుమాన్ నామస్మరణతో పరవశించిపోయారు.

మడకశిరరూరల్: సింగేపల్లి, జిల్లేడుగుంట ఆంజినేయస్వామి, చెండకచెర్ల ఆంజినేయస్వామి, బుళ్లసముద్రం, రేకులకుంట, గోవిందాపురం, నీలకంఠాపురం గ్రామాల్లో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చెండకచెర్లలో ఆంజనేయస్వామి బ్రహ్మ రథోత్సవం వైభవంగా సాగింది. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై రథోత్సవాన్ని వీక్షించారు. నీలకంఠాపురంలో ఆంజనేయస్వామివారిని ఊరేగించారు. మాజీ మంత్రి రఘువీరారెడ్డి పాల్గొన్నారు.



చెండకచెర్లులో ఆంజినేయస్వామి రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

రొద్దం: మండల కేంద్రంలోని పెద్దాంజనేయస్వామి దేవాలయంలో అర్చకుడు గిరీష్‌స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంజనేయస్వామి మాల ధరించిన భక్తులకు ఇరుముడి కార్యక్రమం భక్తి శ్రద్దలతో నిర్వహించారు.

అమరాపురం: అమరాపురంలో ఆంజనేయస్వామికి అభిషేకం గంధం పూజలు నిర్వహించారు.







నీలకంఠాపురంలో ఆంజనేయస్వామి ఉత్సవ మూర్తి ఊరేగింపు, రొద్దం: మాల ధరించిన భక్తులకు ఇరుముడిలు కడుతున్న దృశ్యం, సోమందేపల్లిలో ర్యాలీ

నేత్రపర్వంగా హనుమాన్ శోభాయాత్ర



ఆంజనేయస్వామి ఉత్సవమూర్తి ఊరేగింపు



సూగూరు ఆలయం వద్ద పూజల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ

హిందూపురం: హనుమాన్ జయంతి సందర్భంగా హిందూ సురక్షా సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో హనుమాన్ శోభాయాత్ర వైభవంగా జరిగిది. తొలుత సూగూరు ఆంజనేయస్వామి ఆలయం వద్ద హనుమాన్ చాలీసా పఠనం చేసి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం సీతారామలక్ష్మణ సహిత అంజనేయస్వామి ఉత్సవమూర్తులు రథంపై కొలువుదీర్చారు. ట్రాక్టర్‌పై హనుమాన్ విగ్రహాన్ని కొలువు దీర్చి పూజలు చేసి శోభాయాత్ర ప్రారంభించారు. వేలాది మంది భక్తులు కాషాయ కండువాలు, కాషాయ పాగాలు ధరించి జై శ్రీరాం..జై భజరంగభళీ అంటూ నినాదాలతో బైక్‌ర్యాలీతో రామదండులా ముందుకు కదిలారు. ర్యాలీ బెంగళూరు రోడ్డు, చిన్న మార్కెట్, మెయిన్‌బజార్, గాంధీసర్కిల్, అంబేడ్కర్‌సర్కిల్ మీదుగా పెనుకొండరోడ్డు గుండా మేళాపురం నుంచి దండు రోడ్డులోని బైలాంజనేయస్వామి ఆలయం వరకూ సాగింది. ఆలయం వద్ద విగ్రహాలకు పూజలు చేసి హారతులిచ్చారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

సూగూరు ఆంజనేయస్వామి ఆలయంలో విశేష పూజలు

సూగూరు ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించి వెండి బంగారు అభరణాలు, తులసిమాలతో అలంకరించి ఆకుపూజలు, సింధూర అర్చనలు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. కొల్లకుంట ఆంజనేయస్వామి, కోటా ఆంజినేయస్వామి ఆలయం, కాలువగడ్డ అభయాంజనేయస్వామి ఆలయాల్లో స్వామివారిని అలంకరించి విశేష పూజలు నిర్వహించారు.

పంచముఖ ఆంజనేయస్వామికి పూజలు

సత్యసాయినగర్ వద్ద నిర్మించిన భారీ పంచముఖ అంజనేయస్వామి విగ్రహానికి పెద్ద పంచగంగ, పాలు, పంచమృతాభిషేకాలు నిర్వహించారు. కుంకుమార్చన, ఆకులపూజలు చేపట్టారు.

వైభవంగా ఎలవగంప ఉత్సవం

పుట్టపర్తి టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డు బీడుపల్లిలో ఆదివారం అక్కదేవతల ఎలవగంప ఉత్సవాన్ని గ్రామపెద్దల ఆధ్వర్యంలో పూజారి చెన్నప్ప వైభవంగా నిర్వహించారు. ఎలవ గంపను ఉరుములు, డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా మేకల చెరువు వద్ద వెలసిన అక్కదేవతల అమ్మవార్ల దేవాలయానికి తీసుకెళ్లారు. భక్తులు కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. సోమవారం ఆలయం వద్ద 7 మంది బాలలకు ఒడి నింపే కార్యక్రమం, అనంతరం రాజనాలు దంచే కార్యక్రమం నిర్వహించనున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



ఎలవగంపను ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం

పేదరిక నిర్మూలన సీపీఐతోనే సాధ్యం

- రాష్ట్ర సహాయక కార్యదర్శి సత్యనారాయణమూర్తి



మాట్లాడుతున్న సత్యనారాయణమూర్తి

లేపాక్షి: సమాజంలో పేదరిక నిర్మూలన సీపీఐతోనే సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర సహాయక కార్యదర్శి సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. లేపాక్షిలో జరుగుతున్న శిక్షణ తరగతులు ఆదివారం రెండో రోజు కొనసాగాయి. సత్యనారాయణమూర్తి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశానికి స్వాతంత్య్రం రాక మునుపు, వచ్చిన తరువాత కూడా పేదల జీవితాల్లో ఎలాంటి మార్పు చోటు చేసుకోలేదన్నారు. కొన్ని పార్టీలు కార్పొరేట్ కంపెనీలకు కొమ్ముకాస్తున్నాయని ఆరోపించారు. అన్ని వర్గాల ప్రజల్లో సమానత్వం రావడం కోసం సీపీఐ పనిచేస్తోందన్నారు. ఏపీడబ్ల్యూజే నేత సోమసుందర్, జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్, రైతు సంఘం నాయకులు కాటమయ్య, రాష్ట్ర మహిళా సంఘం సహయక కార్యదర్శి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తల్లుల దినోత్సవం



సీఅండ్ఐజీ మిషన్ కాంపౌండ్ చర్చిలో కేక్ కట్ చేస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: స్థానిక సీఅండ్‌జీ మిషన్ చర్చి, సీఅండ్ఐజీ మిషన్ కాంపౌండ్ చర్చిలో ఆదివారం అంతర్జాతీయ మదర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం కేక్ కట్ చేశారు. ఆదర్శ తల్లుల గురించి బైబిల్‌లో పొందుపరిచిన అంశాలను పాస్టర్ స్టీఫెన్ రాజ్ వినిపించారు. అనంతరం చర్చ్ సెక్రటరీ నాగేంద్ర కుమార్ మాట్లాడారు. సీఅండ్‌జీ మిషన్ చర్చిలో మహిళలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మిషన్ కాంపౌండ్ చర్చి సంఘ ట్రెజరర్ ఆదర్శ కుమార్, జాయింట్ సెక్రటరీ క్రిష్టఫర్, జాయింట్ ట్రెజరర్ ఆనంద్ రాజ్, విక్టర్ జాషువా, జాన్సన్, జార్జ్ బాబు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలింపు



మట్టి తరలించడంతో గుంతలు పడిన దృశ్యం

ముదిగుబ్బ: మండల పరిధిలోని గుంజేపల్లి గ్రామ సమీపంలోని కన్నెకలగొంది స్వామి మాన్యం భూముల్లో అక్రమంగా మట్టిని తరలిస్తున్న వాహనాలను ఆదివారం గ్రామస్తులు అడ్డుకున్నారు. కన్నెకలగొంది మాన్యం భూముల్లో చింత, వేప, తుమ్మ చెట్లు అధికంగా ఉన్నాయి. జిల్లేడు బండ నిర్మాణంలో భాగంగా టిప్పర్లతో మట్టిని తరలిస్తున్నట్లు గ్రామస్థులు తెలుసుకుని అడ్డుకున్నారు. దీంతో సదరు కాంట్రాక్టర్ మట్టిని తరలించే వాహనాలను అక్కడ నుంచి తీసుకెళ్లారు.

లారీ ఢీకొని ఇద్దరికి గాయాలు

కనగానపల్లి: జాతీయ రహదారిపై మొక్కలకు నీరు పెడుతున్న ట్రాక్టర్‌ను లారీ ఢీకొట్టింది. దీంతో నీటి ట్యాంకర్‌తో పాటు ట్రాక్టరు బోల్తా పడింది. స్థానికులు తెలిపిన మేరకు.. రామగిరి మండలం కుంటిమద్దికి చెందిన కాంట్రాక్టర్ చంద్ర ఆదివారం తన ట్రాక్టరుతో జాతీయ రహదారిపై ఉన్న మొక్కలకు నీరు పెడుతున్నాడు. ఈ సమయంలో జాతీయ రహదారిపై వేగంగా వచ్చిన లారీ ట్రాక్టరుకు వెనుక వైపు ఉన్న నీటి ట్యాంకరును ఢీకొట్టింది. దీంతో ట్యాంకర్‌తో పాటు ట్రాక్టరు ఇంజిన్ కూడా బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టరులో ఉన్న చంద్రతో పాటు లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కనగానపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వర స్వామి

పెనుకొండ: పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో 6 రోజులుగా జరుగుతున్న బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి విశ్వరూప దర్శనంతో బ్రహ్మోత్సవాలు ముగిసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేటి నుంచి బోగాదమ్మ ఆలయంలో విగ్రహాల ప్రతిష్ట

గాండ్లపెంట: మండల పరిధిలోని కటారుపల్లి పంచాయతీ సాదులవాండ్లపల్లి గ్రామ సమీపంలోని బోగాదమ్మ ఆలయంలో సోమవారం నుంచి రెండు రోజుల పాటు విష్ణుదుర్గ, విఘ్నేశ్వర విగ్రహాల ప్రతిష్ట ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. 15వ తేదీ సాయంత్రం 5 గంటలకు బోగాదమ్మ ఆలయంలో గణపతి పూజ, కలశ స్థాపన, మహామంగళ హారతి, రాత్రికి చెక్కభజన, 16న గోపుర కలశస్థాపన, పుష్పాధి వాసం, తీర్థప్రసాద వినియోగం, రాత్రికి సత్యహరిశ్చంద్ర పౌరాణిక నాటకం, 17న ఉదయం ప్రాణప్రతిష్ఠ, దర్పణ దర్శనం, పూర్ణాహుతి, రాత్రికి పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి జీవిత చరిత్ర నాటకం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. దాతలు, గ్రామస్తుల సహకారంతో మూడు రోజుల పాటు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

26వ వార్డులో నేడు గడప గడపకూ....

హిందూపురం టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 26వ వార్డులో సోమవారం సాయంత్రం 4.30 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.